క్లుప్తంగా

రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగులకు హెల్త్ స్కీం వర్తింపు

మద్దిలపాలెం: పదవీ విరమణ చేసిన ఏపీపీటీడీ ఉద్యోగులకు హెల్త్ స్కీం ద్వారా వైద్యం అందించేలా ప్రభుత్వం జీవో జారీ చేసిందని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పీవీ రమణారెడ్డి, వై.శ్రీనివాసరావు పేర్కొన్నారు. జీవో జారీ చేసిన ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బయో డైవర్సిటీ పార్క్‌ను సందర్శించిన విద్యార్థులు



మొక్కల ప్రాముఖ్యతను వివరిస్తున్న రామ్మూర్తి

బీచ్‌రోడ్డు: ఓ ప్రైవేటు విద్య సంస్థకు చెందిన విద్యార్థులు పెదవాల్తేరులోని బయో డైవర్సిటీ పార్క్‌ను మంగళవారం సందర్శించారు. పార్క్ పర్యవేక్షకుడు రామ్మూర్తి విద్యార్థులకు వివిధ రకాల మొక్కల ప్రాముఖ్యతను వివరించారు. మొక్కల శాస్త్రీయ నామాలు, ఉపయోగాలు, పెరిగే వాతావరణాన్ని వివరించారు.

కాలినడకన తిరుమలకు..



పాదయాత్ర చేస్తున్న వెంకట్ (ఫైల్)

మద్దిలపాలెం: తిరుమల తిరుపతికి కాలినడక ప్రయాణం చేసి శ్రీవారిని దర్శించుకున్నాడు విశాఖకు చెందిన పూసర్ల వెంకట్. హెచ్‌బీకాలనీలో నివాసముంటున్న వెంకట్ హిందుత్వాన్ని చాటిచెప్పేందుకు కాలినడక తిరుమలకు శ్రీకారం చుట్టారు. నవంబర్ నెలాఖరున ప్రారంభించిన యాత్ర జనవరి 2తో ముగిసింది. రోజుకు 25 కిలోమీటర్ల మేర నడక సాగించారు. సుమారు 800 కిలోమీటర్ల మేర యాత్ర సాగిందని వెంకట్ తెలిపారు. యాత్రలో అడుగడుగునా స్థానికుల నుంచి ఆదరణ లభించిందన్నారు.

స్టీల్‌ప్లాంట్‌పై మోదీ స్పష్టమైన ప్రకటన చేయాలి



ఆరిలోవ బీఎస్‌ఆర్ నగర్‌లో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ఆరిలోవ: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపేస్తున్నట్లు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రకటన చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.కె.ఎస్.వి కుమార్ డిమాండ్ చేశారు. జీవీఎంసీ పదో వార్డు పరిధి తోటగరువు దరి బి.ఎస్.ఆర్ నగర్‌లో మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. స్టీల్ ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. విశాఖ సభలోస్టీల్ ప్లాంట్‌కు సొంత ఘనులు కేటాయిస్తామని ప్రధాని ప్రకటించాలన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకుండా ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నరేంద్రకుమార్, నాగరాజు, రమణమ్మ, మణి, సన్యాసమ్మ అన్నపూర్ణ, నారాయణరావు, మాళి, సూరిబాబు పాల్గొన్నారు.

రశీదు పుస్తకాల వితరణ

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డు కార్పొరేటర్ పల్లా అప్పలకొండ భర్త పల్లా అప్పారావు జ్ఞాపకార్థం మంగళవారం జ్ఞానపురం హిందు శ్మశాన వాటికకు సంబంధించి రశీదు పుస్తకాలను వితరణ చేశారు. ఈ పుస్తకాలను వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ పల్లా దుర్గారావు నిర్వహకులకు అందజేశారు.



బీచ్ రోడ్డులో నిలిచిపోయిన వాహనాలు



బీచ్ రోడ్డులో నమూనాకాన్వాయ్ వెళుతుండగా నిలిచిన వాహనాలు

అష్టదిగ్బంధనం

- ప్రధాని సభ నేపథ్యంలో భారీగా పోలీసుల మోహరింపు
- అడుగడుగునా ఆంక్షలు
- పండగ వేళ ఇబ్బంది పడుతున్న ప్రజలు

ఏయూక్యాంపస్ : నగరంలో ప్రధాని పర్యటనను పురస్కరించుకుని ఎటుచూసినా పోలీసులు హడావుడి కనిపిస్తోంది. అడుగడుగునా ఆంక్షలు అమలవుతున్నాయి. భారీగా పోలీసు బలగాలు తరలివచ్చాయి. దీంతో పండగ వేళ వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల మళ్లింపుతో ఎటు వెళ్లాలో తెలియక సతమతమయ్యారు. నగరం పోలీసు వలయంలా ఉందా అనే సందేహం కలుగుతోంది. ఏయూ పరిసరాలు, బీచ్‌రోడ్డు, సిరిపురం,ఆర్‌టిసి కాంప్లెక్స్, ఎంవీపీకాలనీ, జాతీయ రహదారి ప్రాంతాలలో పోలీసులు పహారా ప్రారంభించారు. ఏయూలో పలు ప్రాంతాలలో పోలీసులకు విధులు కేటాయించారు.

విభాగాల వారీగా సిబ్బందికి వివిధ పాయింట్ల వద్ద విధులు నిర్వహిస్తున్నారు. ఆర్.కె బీచ్, సిరిపురం కూడలిలో పోలీసులు అధికంగా కనిపించారు. ఇతర ప్రాంతాల నుంచి సైతం పోలీసులను ప్రధాని సభ బదోబస్తుకు తీసుకువచ్చారు.

పోలీసుల సన్నద్ధం... : ప్రధాని సభ నేపథ్యంలో పోలీసులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా మంగళవారం కాన్వాయ్ నమూనా పరీక్షించారు. నమూనా కాన్వాయ్ నోవాటెల్ హోటల్ రోడ్డులోకి ప్రవేశిస్తున్న సమయంలో వాహనాలను నిలిపివేశారు. దీంతో కోస్టల్ బ్యాటరీ నుంచి ఆర్‌కే బీచ్ వరకు వెళ్లే వాహనాలు భారీగా నిలిచిపోయాయి.

పెదవాల్తేరు రోడ్డు మూసివేత

బీచ్‌రోడ్డు: ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో పెదవాల్తేరు నుంచి కాంప్లెక్స్‌కు వెళ్లే మార్గాన్ని పోలీసులు మూసివేశారు. మంగళవారం పోలమాంబ ఆలయం వద్ద రోడ్డును మూసివేశారు. దీంతో కాంప్లెక్స్ వైపు వెళ్లే వాహనాదారులను ఇతర మార్గాలకు మళ్లించారు.




పోలీసులు మూసివేసిన పెదవాల్తేరు రోడ్డు



ప్రధాన మంత్రి రాక పురస్కరించుకొని మద్దిలపాలెం జాతీయ రహదారి డివైడర్లను తవ్వేసి రాకపోకలకు అనువుగా రోడ్డు సిద్ధం చేశారు

పార్కింగ్ కోసం ఇనుప గేట్ల తొలగింపు



ముడసర్లోవ వెనుక రోడ్డులో జీవీఎంసీ సిబ్బంది తొలగించిన గేట్లు

ఆరిలోవ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సభకు భారీ జనసమీకరణ జరుగుతున్న నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే బస్సులు, ఇతర వాహనాల పార్కింగ్ కోసం జీవీఎంసీ అధికారులు ముడసర్లోవ వెనుక రోడ్డులో ఇనుప గేట్లు తొలగించారు. గతంలో ఈ ప్రాంతంలో లారీలతో వ్యర్థాలు ఇక్కడ డంప్ చేసేవారు. దీంతో ఈ ప్రాంతమంతా వ్యర్థాలతో నిండిపోయి వాహనరాకపోకలకు వీలులేకుండా ఉండేది. దీంతో లారీలు రాకపోకలు సాగించే వీలు లేకుండా జీవీఎంసీ అధికారులు రెండేళ్ల క్రితం నాలుగు చోట్ల ఇనుప గేట్లు ఏర్పాటు చేశారు. దీంతో వ్యర్థాల డంప్‌నకు బ్రేక్ పడింది. బుధవారం నగరంలో ప్రధానమంత్రి సభకు వివిధ జిల్లాలు నుంచి జనాలను తీసుకువచ్చే వాహనాల పార్కింగ్ కోసం ముడసర్లోవలోని ఇనుప గేట్లు తొలగించారు. అనకాపల్లి, నర్సీపట్నం, పాడేరు, అరుకు, చింతపల్లి, సబ్బవరం, ఎస్.కోట ప్రాంతాల నుంచి జనాలను సభకు తరలించి వాహనాలు ఇక్కడ పార్కింగ్ సదుపాయం కల్పించారు.

బారులుతీరిన వాహనాలు

ఏయూక్యాంపస్ : నగరంలో ప్రధానమంత్రి పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు నగరంలో అమలు చేస్తున్నారు. దీంతో మంగళవారం మధ్యాహ్నం నుంచి పలు ప్రాంతాలలో ట్రాఫిక్ మళ్లింపులు జరిగాయి. దీంతో ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తప్పలేదు. సిరిపురం నుంచి పెదవాల్తేరుకు వెళ్లే మార్గంలో ప్రధాని రోడ్ షో జరగనుంది. ఈ మార్గంలో మంగళవారం సాయంత్రం నుంచి వాహన రాకపోకలు పూర్తిగా నిలిపివేశారు. దీంతో వాహనాలు సిరిపురం-చిన వాల్తేరు,బీచ్ రోడ్డు మీదుగా వెళ్లాయి. దీంతో ఈ ప్రాంతంలో విపరీతమైన రద్దీపెరిగింది. సాధారణంగా సాయంత్రం వేళల్లో బీచ్‌రోడ్డులో వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. దీనికితోడు ప్రధాని పర్యటనతో వాహనాలు బారులుదీరాయి.



వాహనాల పార్కింగ్‌ని సూచిస్తూ ఏర్పాటు చేసిన బోర్డులు



చినవాల్తేరు రోడ్డులో బారులు తీరిన వాహనాలు

ప్రధాని సభ ఏర్పాట్ల పరిశీలన

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ మైదానంలో బుధవారం జరిగే ప్రధాన మంత్రి మోదీ బహిరంగ సభ వేదిక ఏర్పాట్లను బీజేపీ నాయకులు పరిశీలించారు. ఆ పార్టీ నాయకులు ప్రకాష్ రెడ్డి, విజయానంద రెడ్డి, రూపాకుల రవి కుమార్, బాల రాజేశ్వర రావు, కొప్పుల రామ్ కుమార్, వేంకటేశ్వర రావు, నాగశివం రెడ్డి తదితరులు మంగళవారం అధికారులను కలిసి ఏర్పాట్లపై చర్చించారు.



సభా ప్రాంగణంలో బీజేపీ నాయకులు



బీచ్ రోడ్లో బందోబస్తులో పోలీసుల నిమగ్నం

ట్రావెల్ డ్రైవర్ల సేవలు అభినందనీయం

మద్దిలపాలెం: పర్యాటకంగా విశేష అభివృద్ధి సాధిస్తున్న విశాఖ ఖ్యాతి మరింత పెరిగేలా పర్యాటకులను వారి గమ్య స్థానాలకు సురక్షితంగా చేరవేయడంలో ట్రావెల్ డ్రైవర్లు కీలక బాధ్యత వహిస్తున్నారని పరమేశ్వర ట్రావెల్ గ్రూప్ అడ్మిన్ పరమేశ్వరరావు పేర్కొన్నారు. సుమారు 500 మందిపైగా గ్రూప్ సభ్యులతో మంగళవారం నగరంలో ఓ పార్కులో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. గ్రూప్ అడ్మిన్ అయిన గొన్నబత్తుల పరమేశ్వరరావును గ్రూప్ సభ్యులు సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు ట్రావెల్ కంపెనీల యజమానులు మాట్లాడుతూ గ్రూప్‌లోగల ట్రావెల్ డ్రైవర్లను, సభ్యులు ఒక తాటిపై నడిపించడమే కాకుండా వారి శ్రేయస్సు కోసం పరమేశ్వరరావు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ముఖ్యంగా విశాఖ నగరానికి వచ్చే పర్యాటకులు మెరుగైన సేవలందించంలో గ్రూప్ తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయమన్నారు. సన్మానకర్త, గ్రూప్ అడ్మిన్ పరమేశ్వరరావు మాట్లాడుతూ దేశ, విదేశాల నుంచి నగరానికి వచ్చే ప్రయాణికులను పర్యాటక ప్రాంతాలకు తీసుకువెళ్లి ఎంతో సురక్షితంగా తీసుకొస్తున్న డ్రైవర్లను ఈ సందర్భంగా అభినందించారు. డ్రైవర్ల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.



పరమేశ్వరరావును సత్కరిస్తున్న డ్రైవర్లు, ఓనర్లు

వైభవంగా 23వ పాశుర విన్నపం

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని సెక్టార్-6లోని శ్రీ వేంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో ధనుర్మాస మహోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవాన్ని పురస్కరించుకొని 23వ పాశుర విన్నపం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా వేంకటేశ్వరస్వామిని వివిధ రకాల పుష్పాలతో, శ్రీ ప్రసన్న అంజనేయ స్వామిని మొక్కజొన్న పొత్తులతో ప్రత్యేకంగా అలంకరించారు. సుబ్రహ్మణ్యస్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. దీంతో భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి విచ్చేసి ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామివార్లను దర్శించుకున్నారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు



వివిధ వేషధారణలో చిన్నారులతో ఉపాధ్యాయులు

ఆరిలోవ: విశాఖ వ్యాలీ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు మంగళవారం ఘనంగా జరిగాయి. పిల్లలు వివిధ దుస్తులు ధరించి వేషధారణలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పాఠశాల ఆవరణలో సందడి చేశారు. హరిదాసులు పాటలు, గంగిరెద్దులు ఆటలు, చిన్నారులు ఎరుక (సోది) చెప్పడం, పిట్టల దొర మాటలు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులను అలరించాయి. బోగి పండ్లు పోయడం, బోగి మంటల వేయడం, సంక్రాంతి పిండి వంటలు ప్రదర్శనతో సంబరాలు అంబరాన్నంటాయి. పిల్లల నృత్యాలు, జానపద గీతాలు ఆకట్టుకున్నాయి. పిల్లలు గాలి పటాలు ఎగురవేసి సరదాగా గడిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరి ప్రభాకర్ చిన్నారులను అభినందించారు.

సత్యసాయి విద్యావిహార్‌లో..

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్-8లోని శ్రీ సత్యసాయి విద్యావిహార్‌లో సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. సంప్రదాయం ఉట్టిపడేలా విద్యార్థులు చేసిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణతో పాల్గొన్నారు. రంగోళి ఎదుట నృత్య ప్రదర్శనలు చేయడంతో పాటు హరిదాసు వేషధారణ, ముత్తైదువుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ప్రశాంతి నిలయం (పుట్టపర్తి) అడ్మిన్ ఆఫీసర్ ఎస్‌జీ చలం, విశాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రిన్సిపాల్ ఈశ్వరికి ఎరుక చెబుతున్న చిన్నారి



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

కిటకిటలాడిన సంక్రాంతి సంత



సంతలో విక్రయిస్తున్న కాస్మోటిక్స్ వస్తువులు

ఆరిలోవ: నడిరోడ్డు మీదే సంత..వందల దుకాణాలు..వేలమంది వినియోగదారులు..వారానికి ఒకరోజు కిటకిటలాడుతోంది. పండగ సమయం కావడంతో మరింత రద్దీగా మారింది. జీవీఎంసీ 11వ వార్డు పరిధి బాలాజీనగర్ (పాత ఆరిలోవ)లో ప్రధాన రహదారిపై ప్రతి మంగళవారం వారపు సంత జరుగుతోంది. ఆరిలోవ ప్రాంతంలో వినియోగదారులతో సంత కిటకిటలాడుతోంది. చుట్టుపక్కల కాలనీవాసులకు ఈ సంతే అందుబాటులో ఉంటుంది. నడి రోడ్డుపై జరుగుతున్న ఈ సంతకు వేలమంది వినియోగదారులు వస్తుంటారు. సంతలో దొరికే వస్తువులు కోసం ఆరిలోవ చుట్టుపక్కల నుంచి వచ్చిన వేలమంది వినియోగదారులు తరలివచ్చారు. అటు ఆదర్శనగర్, రవీంద్రనగర్, పాత డెయిరీఫారం, తోటగరువుతో పాటు ఇటు అంబేడ్కర్‌నగర్, టీఐసీ పాయింట్, దుర్గాబజార్, ఆరిలోవకాలనీ, శ్రీకాంత్‌నగర్‌తో పాటు కొండవాలు ప్రాంతాలైన దీనదయాల్‌పురం, చినగదిలి, పెదగదిలి, హనుమంతవాక ప్రాంతాల నుంచి వినియోగదార్లుతో ఈ ప్రాంతం నిండిపోయింది. పండగ వరకు సరిపడే కూరగాయలు, కావాల్సిన సరుకులు కొనుగోలు చేసుకొన్నారు.

అన్ని వస్తువులు లభ్యమయ్యే చోటు

ఈ సంతలో గుండిసూది నుంచి అన్ని వస్తువులు లభిస్తాయి. కాయగూరలతో పాటు వంట సామాన్లు, వంట పాత్రలు, వివిధ రకాల దుస్తులు, దుప్పట్లు, చీపుర్లు, ప్లాస్టిక్ సామాన్లు, గాజులు, కాస్మోటిక్ వస్తువులు, గాజు సామాన్లు, స్టీలు సామాన్లు, మసాలా దినుసులు, ఉల్లి, మిరపతో పాటు నిమ్మకాయలు, కొబ్బరి కాయలు, అన్ని రకాల పండ్లు, పప్పులు ఇక్కడ విక్రయిస్తారు. సంక్రాంతి వంటలకు వాటిని కొనుగోలు చేయడానికి స్థానికులు పెద్ద సంఖ్యలో చేరుకోవడంతో ఈ వారం సంత మరింత సందడిగా మారింది. ఇక్కడ జరిగే సంతకు ఆనందపురం, తగరపువలస, భీమిలి ప్రాంతాల నుంచి తాజా కూరగాయలతో రైతులు, కూరగాయల వ్యాపారులు, ఇతర వస్తువులు విక్రయించే వ్యాపారులు సుమారు 300 నుంచి 350 వరకు షాపులు నిర్వహిస్తుంటారు.



బాలాజీనగర్ వారపు సంతలో విక్రయిస్తున్న వివిధ రకాల దుస్తులు



వివిధ రకాల గాజుల విక్రయం



మసాలా దినుసులు

మోదీ పర్యటనతో ఉత్తరాంధ్ర అభివృద్ధికి ముందడుగు

ఎంవీపీకాలనీ: ప్రధాని నరేంద్రమోదీ విశాఖ పర్యటనతో ఉత్తరాంధ్ర అభివృద్ధికి ముందడుగు పడనుందని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో మంగళవారం ఆయన నగరానికి వచ్చారు. తొలుత ప్రధాన మోదీ కార్యక్రమానికి సంబంధించి ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ..పార్లమెంట్ లోపల, బయట అవినీతి రహిత పాలన సాగిస్తూ దేశాన్ని ముందుకు నడిపిస్తున్నారన్నారు. విశాఖ పర్యటన ద్వారా ఉత్తరాంధ్రకు పలు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు రానున్నాయన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై విలేకరుల ప్రశ్నించగా ..స్టీల్‌ప్లాంట్‌ను లాభాల్లో నడిపించేలా నిర్ణయం తీసుకోవాలని ప్రధానిని కోరతామన్నారు.



మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

విద్యార్థుల అభ్యున్నతిలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర



మాట్లాడుతున్న ఆర్జేడీ విజయ భాస్కర్

విశాఖ విద్య: విద్యార్థుల అభ్యున్నతిలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని విద్యాశాఖ ఆర్జేడీ విజయ భాస్కర్ అన్నారు. చినగదిలి మండలంలోని శ్రీ కళాష్ ఎడ్యుకేషన్ స్కిల్స్ సెంటర్‌లో జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలందరూ విద్యలో నైపుణ్యత సాధించేలా ఆటపాటలతో బోధన సాగించాలన్నారు. పిల్లలకు పునాది స్థాయిలోనే అద్భుతమైన విద్యాబోధన జరగాలని, అప్పుడే మనం అనుకున్న రీతిలో పిల్లలు ఎదుగుతారని, ఆ రీతిగా శిక్షణ పొంది పిల్లలను తీర్చిదిద్దాలన్నారు. సమగ్ర శిక్ష ఏఎంవో లక్ష్మి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

చట్టాలపై అవగాహన అవసరం

తాటిచెట్లపాలెం : జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూ కాలనీలో గల జీవీఎంసీ హైస్కూల్, కేఎస్ఎం గరల్స్ హైస్కూళ్లను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సివిల్ జడ్జి ఎం.వెంకటశేషమ్మ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల హక్కులు, చట్టాలపై విద్యార్థులకు వివరించారు.